సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 28 । జూలై । 2023


పరిగి: రోడ్డుపై నుంచి పొంగిపొర్లుతున్న బ్రాహ్మణిపల్లి వాగు


కొడంగల్ రూరల్: జలపాతాన్ని తలపిస్తున్న భవనమ్మతండా వాగు

న్యూస్‌రీల్

నాసా ప్రాజెక్టుకు విద్యార్థుల డాక్యుమెంటరీ

వికారాబాద్ అర్బన్: అంతర్జాతీయ నాసా ప్రాజెక్టుకు వికారాబాద్ శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు పంపిన డాక్యుమెంటరీకి మొదటి స్థానం దక్కినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రియాజొద్దీన్ తెలిపారు. శాటిలైట్‌ను అతి తక్కువ బరువుతో నింగిలోకి ఎలా పంపించాలనే దానిపై తమ పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థుల బృందం, ఉపాధ్యాయులు డాక్యుమెంటరీని ఏడాది పాటు శ్రమించి తయారు చేసినట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 40వేల డాక్యుమెంటరీలు ప్రెజెంటేషన్ ఇవ్వగా తమ పాఠశాల మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. మారుమూల ప్రాంతమైన వికారాబాద్ నుంచి నాసా ప్రాజెక్టుకు ఎంపిక కావడంపై పాఠశాల యాజమాన్యం విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించినట్లు ఆయన తెలిపారు.

శిథిలావస్థలో ఉన్న భవనాల కూల్చివేత

కొడంగల్ : మున్సిపల్ పరిధిలో శిథిలావస్థలో ఉన్న పాత భవనాలను కూల్చివేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి గురువారం రెండో వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌రావుతో కలిసి పర్యటించారు. పాత భవనాల దగ్గరకు వెళ్లి పరిస్థితిని గమనించారు. కూలడానికి సిద్ధంగా ఉన్న వాటిని జేసీబీ సాయంతో మున్సిపల్ సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. పిల్లలు మహిళలు వృద్ధులు బయటకు రావద్దని సూచించారు. విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లరాదన్నారు.


ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాల్సిందే


కలెక్టరేట్‌ను ముట్టడించిన గ్రామ పంచాయతీ కార్మికులు

అనంతగిరి: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. ఈమేరకు గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెలో భాగంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. డిమాండ్‌లు పరిష్కరించేదాకా ఉద్యమం కొనసాగుతుందన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, చంద్రయ్య, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో విద్యార్థిని మృతి

- వికారాబాద్ కొత్తగడి హాస్టల్‌లో ఘటన
- ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని బాలిక తల్లిదండ్రుల ఆవేదన


నందిని (ఫైల్)

అనంతగిరి: గురుకులంలో విద్యార్థిని అస్వస్థతకుగురై మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పూడూరు మండలం బాకాపూర్‌కు చెందిన నందిని (16) అనే విద్యార్థిని వికారాబాద్‌లోని కొత్తగడి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. రోజు మాదిరిగానే ఉదయం స్టడీ అవర్‌కు తోటి విద్యార్థులు రావాలని కోరగా తనకు ఆరోగ్యం బాగాలేదని చెప్పి పడుకుంది. ఎంతకూ లేవకపోవడంతో ఉపాధ్యాయులకు చెప్పారు. వెంటనే వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. జీవనోపాధి కోసం శేరిలింగంపల్లిలో ఉంటున్న తల్లిదండ్రులకు విషయం తెలిపారు. కుటుంబీకులు పాఠశాలకు చేరుకుని బోరున విలపించారు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్లే మా కూతురు మృతి చెందిందని ఆరోపించారు. ఇదిలా ఉండగా నందిని నెల క్రితమే అడ్మిషన్ పొందింది. ఈ మధ్య కాలంలో ఆరోగ్యం బాగాలేకపోతే ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో పంపించారు. నగరంలో డాక్టర్లకు చూపించామని, ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారని తల్లి మూడు రోజుల క్రితం హాస్టల్‌లో వదిలిపెట్టి వెళ్లింది. ప్రిన్సిపాల్ అపర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శీను తెలిపారు. పోస్టుమార్టం అనంతరం అన్ని విషయాలు తెలుస్తాయని సీఐ తెలిపారు. ఇదిలా ఉంటే విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని పలువురు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.


తాండూరు రూరల్: తాండూరు-నారాయణపూర్ బ్రిడ్జిపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు..


బషీరాబాద్: జుంటివాగుకు పోటెత్తిన వరద

రెడ్ అలర్ట్


యాలాల: శివసాగర్ ప్రాజెక్టు ఉధృతి

జిల్లాలో ఉధృతంగా వర్షాలు

- జలాశయాలకు పోటెత్తుతున్న వరద
- పరవళ్లు తొక్కుతున్న ఈసీ, మూసీ, కాగ్నా వాగులు
- పలు ప్రాంతాల్లో నీటమునిగిన పంటలు
- క్షేత్రస్థాయిలో పర్యటించిన కలెక్టర్, ఎస్పీ
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- ప్రజలు బయటకు రావద్దంటూ హెచ్చరికలు

వికారాబాద్ : జిల్లాలో ఉధృతంగా వర్షాలు కురుస్తుండటంతో రెడ్ అలర్ట్ ప్రకటించారు. అధికార యంత్రాంగమంతా అప్రమత్తమైంది. గురువారం రోజంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. గడిచిన 24 గంటల్లో మరింత ఉధృతమయ్యాయి. వాగులు వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. ప్రధాన ప్రాజెక్టులన్నీ నిండుకుండాల్లా మారాయి. జిల్లాలో మొత్తం 1,179 చెరువులు ఉండగా ఇప్పటి వరకు 1,023 పూర్తిస్థాయిలో నిండాయి. పలుచోట్ల రోడ్లపై నుంచి వరద ఉధృతి కొనసాగుతుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.

కొనసాగుతున్న కంట్రోల్ రూంలు

రెడ్‌అలర్ట్ ప్రకటించడంతో కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు కొనసాగుతున్నాయి. ప్రభావిత ప్రాంతాల ఎస్ఐలు సైతం తమతమ పోలీస్ స్టేషన్లలో కంట్రోల్‌రూంలు నిర్వహిస్తున్నారు. ప్రధాన ప్రాజెక్టులు శివసాగర్, నందివాగు, జుంటుపల్లి, కోట్‌పల్లి, లఖ్నాపూర్, సర్పన్‌పల్లి తదితర ప్రాజెక్టులు ఉధృతంగా అలుగు పారుతున్నాయి.

కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణ

జిల్లాలో నెలకొన్న పరిస్థితులను కలెక్టర్ నారాయణ రెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి ఎప్పటికప్పుడు సమీక్షించారు. అధికారులతో వీడియో కాన్ఫరెన్స్, సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అనంతరం కలెక్టర్.. ఆర్డీఓతో కలిసి దన్నారం వద్ద మూసీవాగు, గొట్టిముక్కుల వాగులు, బ్రిడ్జిలను పరిశీలించారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు. అన్ని వాగులు, బ్రిడ్జిల వద్ద రెవెన్యూ, పోలీసులు కాపలా ఉండేలా ఏర్పాట్లు చేశారు. వానలు తగ్గే వరకు ఎవరూ బయటకు రావద్దని, ప్రమాదంగా ఉన్న చోట వాగులు దాటొద్దని గ్రామాల్లో దండోరా వేయించాలని కలెక్టర్ యంత్రాంగానికి సూచించారు. ప్రమాదకరంగా ఉన్నచోట బారికేడ్లు ఏర్పాటు చేశారు. వికారాబాద్ - పరిగికి, ధారూరు- దోర్నాల్ వెళ్లే దారుల్లో వాగులు బ్రిడ్జీలపైనుంచి వరద ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వందల ఎకరాల పంటలు నీటమునిగాయి. యంత్రాంగమంతా సహాయక చర్యల్లో నిమగ్నమైంది. వికారాబాద్, తాండూరు, పరిగి పట్టణాల్లో లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరింది.

వాగులు ఉధృతం

ప్రధానమైన మూడు నదులు పరవళ్లు తొక్కి ప్రవహిస్తున్నాయి. ఈసీ, మూసీ, కాగ్నా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అక్కడక్కడా పొలాల్లోంచి ప్రవహిస్తుండటంతో పంటలన్నీ నీట మునిగాయి. ఆయా వాగులు, బ్రిడ్జీల వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పహారా కాస్తున్నారు. పది రోజులకు పైగా కురుస్తున్న వర్షాలతో పలు చోట్ల ఇళ్లు కూలాయి.


మోమిన్‌పేటలోని ఏన్కతలలో నీట మునిగిన పత్తి పంట

జుంటివాగు పరవళ్లు

బషీరాబాద్: మండలంలో జుంటివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద పోటెత్తడంతో పరీవాహకంలో ఉన్న పంటలన్నీ నీట మునిగాయి. కాగ్నానది మరోసారి ఉగ్రరూపం దాల్చింది. జీవన్గి దగ్గర మహదేవ లింగేశ్వర స్వామి ఆలయాన్ని వరద వీడలేదు. ఆలయం చుట్టూ వరదనీరు చేరడంతో వారం రోజులుగా ఆలయంలో కైంకర్యాలు నిలిచిపోయాయి. మండలంలోని అన్ని చెరువులు మత్తడి దుముకుతున్నాయి. తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ రమేష్, ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ వాగులు, చెరువుల దగ్గర ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

జలపాతంలా..

కొడంగల్ రూరల్ : మండల పరిధిలోని భవనమ్మ తండా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జలపాతాన్ని తలపిస్తోంది. భవనమ్మతండా, భీంలీ తడాల మధ్య ఉన్న ఈ జలపాతాన్ని చూసేందుకు జనం తరలివస్తున్నారు. అయితే గుట్టల మధ్యకు వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో జల అందాలను చూడలేకపోతున్నామని పలువురు పేర్కొంటున్నారు.

సహాయక చర్యలు చేపట్టాలి: కలెక్టర్

వికారాబాద్ అర్బన్: కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్, ఎస్పీతో చీఫ్ సెక్రటరీ శాంతికుమారి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర సహాయం అందించేందుకు జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ, పోలీస్, హెల్త్, పంచాయతీరాజ్, విద్యుత్, మున్సిపల్ అధికారులతో బృందాలను ఏర్పాటు చేసి 24 గంటలు పర్యవేక్షిస్తున్నామన్నారు. అత్యవసర పరిస్థితిలో కంట్రోల్ రూమ్ నంబర్ 79950 61192, ల్యాండ్ లైన్ నంబర్ 08416-235291ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 214 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. 40 మంది నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి భోజనం, నీరు, మందులు, అవసరమైన దుప్పట్లు అందించామన్నారు.


దన్నారం వెళ్లే దారిలో బ్రిడ్జిని పరిశీలిస్తున్న కలెక్టర్, ఆర్డీఓ


ధారూరు: రుద్రారం-నాగసముందర్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఐజీ, ఎస్పీ


కొడంగల్ రూరల్: బీంలీ తండా సమీపంలో చెరువును తలపిస్తున్న కంది పంట


బొంరాస్‌పేట: అలుగు పారుతున్న బొంరాస్‌పేట చెరువు


అనంతగిరి: గోధుమగూడలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్

‘వైకుంఠా’నికి రూ.కోటి.. నాణ్యత ఏపాటి?

- ప్రారంభానికి నోచుకోకముందే ఉరుస్తున్న పైకప్పులు
- మందు బాబులకు అడ్డగా మారిన శ్మశాన వాటిక
- నాసిరకం నిర్మాణంతో అంతా అస్తవ్యస్తం


నిరుపయోగంగా ఉన్న బర్నింగ్ షెడ్లు

వికారాబాద్ అర్బన్: రూ.కోటికిపైగా వెచ్చించి నిర్మించిన వైకుంఠధామం ప్రారంభానికి నోచుకోకముందే గదులు ఉరుస్తున్నాయి. ఇందులో ఏ పని కూడా నాణ్యతగా చేపట్టలేదు. పైగా ఇందులో ఇప్పటి వరకు దహన కార్యక్రమాలు చేయకపోవడం గమనార్హం. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని గంగారంలో రూ.కోటి 4లక్షలు వెచ్చించి శ్మశాన వాటిక నిర్మించారు. ఒకే సారి ఐదు శవాలను దహనం చేసేలా షెడ్లు నిర్మించారు. వచ్చిన బంధూమిత్రులు స్నానాలు చేసేలా గదులను నిర్మించి నీటి సౌకర్యం కూడా కల్పించారు. హిందువులు ప్రత్యేకంగా పూజా కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఒక హాల్, సామగ్రి భద్ర పర్చుకునేందుకు గది, శ్మశాన వాటిక వ్యవహారాలు చూసుకునే అధికారికి గది, సిబ్బందికి మరో గదితోపాటు ప్రధాన గేటు నుంచి శ్మశాన వాటికి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. ఇదంతా బాగానే ఉన్నా ప్రారంభించి ప్రజలకు ఉపయోగంలోకి తీసుకురావడంలో పాలకులు, అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన శ్మశాన వాటిక మందు బాబులకు అడ్డాగా మారింది.

నిధుల గోల్‌మాల్

శ్మశాన వాటిక నిర్మాణానికి వికారాబాద్ మున్సిపల్ తరఫున రూ.కోటికి పైగా ఖర్చు చేశారు. 2016-17లో 14 ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.50లక్షలు కేటాయించారు. ఈ నిధులతోనే శ్మశాన వాటిక నిర్మాణం దాదాపుగా పూర్తయినట్లు సమాచారం. ఆ తరువాత వచ్చిన ఓ కమిషనర్ పట్టణ ప్రగతి నిధుల నుంచి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి మరమ్మతుల పేరుతో మరో రూ.40లక్షలు ఖర్చు చేశారనే విమర్శలు ఉన్నాయి. ఇంజనీరింగ్ అధికారులు నిధుల గోల్‌మాల్‌కు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి.

నాసిరకం పనులు

ప్రభుత్వ లక్ష్యానికి అధికారులు, కొందరు పాలకులు గండి కొడుతున్నారనడానికి గంగారంలోని శ్మశాన వాటికే నిదర్శనం. నిర్మాణం జరిగి రెండేళ్లు కూడా పూర్తి కాలేదు. అప్పుడే గదులు వర్షం నీటితో తడిసి ముద్దవుతున్నాయి. నీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన సింటెక్స్ ట్యాంకులు గాలికి కింద పడిపోయాయి. గదులు, షెడ్ల నిర్మాణంలో ఏమాత్రం నాణ్యత పాటించలేదు. పై కప్పులు ఉరుస్తున్నాయి. పలు గదుల తలుపులను ధ్వంసం చేశారు. ప్రస్తుతం మందు బాబులకు అడ్డగా మారింది.

వారంలో ప్రారంభిస్తాం



అక్కడ చిన్న చిన్న పనులు చేయించాల్సి ఉంది. ఆ పనులు పూర్తి చేయడంతో పాటు, కైలాస విగ్రహం కూడా ఏర్పాటు చేస్తాం. పనులు పూర్తి చేసి వారం రోజుల్లో శ్మశాన వాటికను ప్రారంభిస్తాం.

– జాకీర్ హైమద్, మున్సిపల్ కమిషనర్, వికారాబాద్

విధుల్లో నిర్లక్ష్యం తగదు

- మరో 48 గంటలు అప్రమత్తంగా ఉండాలి
- మల్టీ జోన్ -2 ఐజీ షానవాజ్ ఖాసీం

అనంతగిరి: వర్షాలు జోరుగా కురుస్తున్నందునా అందరూ అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం తగదని మల్టీజోన్ -2 ఐజీ షానవాజ్ ఖాసీం పోలీస్ అధికారులను ఆదేశించారు. రాబోయే 48 గంటల్లో మరింత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పోలీస్ అధికారులు తమ పరిధిలోని ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షానవాజ్ ఖాసీం మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రెవెన్యూ, కలెక్టరేట్, ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో వాగులు, ప్రాజెక్టులు పొంగి పొర్లుతున్నాయని పర్యాటకులు ఎవ్వరూ అనంతగిరి గుట్టలు, కోట్‌పల్లి ప్రాజెక్టు ప్రాంతాలకు రావద్దని ఆదేశించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని సూచించారు.

పోలీస్ అధికారుల పనితీరు భేష్

జిల్లా పోలీస్ అధికారుల పనితీరును ఐజీ షానవాజ్ ఖాసీం అభినందించారు. సీసీటీవీల ఏర్పాటు, రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యల నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్పీ కోటిరెడ్డి, ఏఎస్పీ శ్రీనివాస్ రావు, డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్, డీఎస్పీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఐజీ

క్లుప్తంగా

'కుళ్లిన గుడ్లు' ఘటనపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

యాలాల: మండలంలోని అడాల్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రం నుంచి బాలింతలకు సరఫరా చేసిన గుడ్లు కుళ్లిపోవడం, విరిగిన పాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నట్లు తాండూరు ఐసీడీఎస్ సీడీపీఓ రేణుక తెలిపారు. గురువారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన బాలింతలకు కుళ్లిన గుడ్లు.. విరిగిన పాలు శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. గ్రామంలోని కొందరు మహిళలకు ఈ నెల 7న గుడ్లు, పాల ప్యాకెట్లను అంగన్‌వాడీ టీచర్ అనసూయ పంపిణీ చేసిందన్నారు. టీహెచ్ఆర్‌లో భాగంగా బాలింతలు ఇంటికి తీసుకెళ్లిన గుడ్లు నిల్వ ఉంచుకోవడంతో ఘటన జరిగి ఉండవచ్చని సీడీపీఓ పేర్కొన్నారు. కాగా మూడు నెలల పాటు టెట్రా ప్యాకెట్‌లో నిల్వ ఉండే పాలు విరగడంపై పట్ల ఆమె వివరణ ఇచ్చారు. టెట్రా ప్యాకెట్ ఒకసారి తెరిచాక పాలు 24 గంటల పాటు వినియోగించకపోతే చెడిపోయే అవకాశం ఉందన్నారు. కాగా ఐసీడీఎస్ నుంచి సరఫరా అయ్యే గుడ్లపై ముద్ర ఉంటుందని, కుళ్లిపోయినట్లు బాలింతలు పేర్కొన్న గుడ్లు ఐసీడీఎస్ సరఫరా చేసినవా కావా అనే విషయంలో సైతం విచారణ చేస్తామన్నారు. టెట్రా పాల ప్యాకెట్‌పై కాలపరిమితి సైతం ఉంటుందన్నారు. అయినప్పటికి ఈ విషయంలో పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నట్లు ఆమె తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


చనిపోయిన ఎద్దు వద్ద రైతు

యాలాల: తెగిపడిన విద్యుత్ తీగకు తగిలి ఓ ఎద్దు మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని రాస్నం గ్రామ శివారులో గురువారం సాయంత్రం జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సప్పకు చెందిన ఓ ఎద్దు గ్రామ శివారులో మేతకు వెళ్లింది. అదే సమయంలో గ్రామానికి చెందిన రమేష్ పొలంలో విద్యుత్ తీగ తెగిపడింది. మేతకు అటు వైపుగా వెళ్లిన ఎద్దు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: ఈదురు గాలులకు తెగిపడిన విద్యుత్ తీగలకు తాకి ఓ గేదె మృతి చెందింది. ఇబ్రహీంపట్నంకు చెందిన రైతు శ్రీశైలం తన పశువులను మేత కోసం వదిలాడు. ప్రభుత్వ ఆస్పత్రి వెనుక మేస్తుండగా ఈదుగు గాలులకు విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. వాటిని తగలడంతో గేదె మృతి చెందింది.

ఆటో బోల్తా.. బాలుడికి తీవ్ర గాయాలు


గాయపడిన బాలుడికి వైద్యం చేస్తున్న సిబ్బంది

దౌల్తాబాద్: మండలంలోని పోశమ్మగడ్డ తండా వద్ద ఆటో బోల్తా పడి బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఈర్లపల్లికి చెందిన ఆటోలో అదే గ్రామానికి చెందిన కొంత మంది ప్రయాణికులు మొగుల్‌మడ్క గ్రామానికి వెళుతున్నారు. ఈ క్రమంలో పోశమ్మగడ్డ దగ్గర ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శివుడ అనే బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బాలుడిని హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

శ్వాసే.. ఆ'ఐ'శ

- క్యాల్షియం లోపంతో ఏడేళ్లుగా బాధపడుతున్న ఐశ
- గట్టిగా పట్టుకుంటే ఎముకలు విరిగిపోయేంత బలహీనంగా బాలిక
- కూర్చోలేని, నిలుచోలేని పరిస్థితి
- రెండు నెలలుగా ఆక్సిజన్‌తోనే శ్వాస
- కరెంటు పోతే పరిస్థితి ఆందోళనకరమే..
- పాపను కాపాడుకునేందుకు తల్లిదండ్రుల పడరాని పాట్లు

కుల్కచర్ల: పిల్లలకు చిన్న గాయమైతేనే కన్నపేగు అల్లాడిపోతుంది.. అలాంటిది ఏడేళ్లుగా నయం కాని వ్యాధితో చిన్నారి కళ్ల ముందు నేలకే పరిమితమైతే ఆ తల్లిదండ్రుల బాధ, వ్యథ చెప్పడానికి కూడా వీలుకాదు.. అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటోంది చౌడాపూర్ మండలంలోని అబ్దుల్ ఉస్మాన్ కుటుంబం. మందిపల్ గ్రామానికి చెందిన అబ్దుల్ ఉస్మాన్, నస్రీన్ దంపతులు. వీరికి ముగ్గురు సంతానం. ఐదేళ్ల వరకు పెద్ద కూతురు అబ్దుల్ ఐశ(15) ఎంతో ఆరోగ్యంగా ఉండేది. రెండో తరగతి చదువుకునే సమయంలో ప్రమాదం జరిగి కాలు విరిగిపోయింది. అప్పుడు సర్జరీ చేశారు. అప్పటి నుంచి బాలికలో ఎదుగుదల నిలిచిపోయింది. దీనికి తోడు క్యాల్షియం లోపం వెంటాడింది. ఐశను గట్టిగా పట్టుకున్నా ఎముకలు విరిగిపోయేవి. దీంతో తల్లిదండ్రులు బాలికను పలు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. కానీ ఫలితం కనిపించలేదు. పేద కుటుంబ కావడంతో ఆర్థిక పరమైన ఇబ్బందులు కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. అయినా అప్పులు చేసి వైద్యం చేయిస్తున్నారు. ఇటీవల ఐశ ఆరోగ్యం మరింత దెబ్బతింది. దీంతో రెండు నెలల పాటు ఆస్పత్రిలో ఉంచారు. ఖర్చులు ఎక్కువ కావడంతో ఇటీవలే ఇంటికి తెచ్చారు. అయితే ప్రస్తుతం ఆమె ఆక్సిజన్‌పై నెట్టుకొస్తోంది. కదలలేని స్థితిలో ఉన్న కూతుర్ని చూసి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఆటో నడిస్తే తప్ప కుటుంబం గడవని పరిస్థితిలో కూతురి వైద్యం కోసం నెలకు రూ.10 వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తోందని అబ్దుల్ ఉస్మాన్ తెలిపారు. ఇన్వర్టర్, కరెంటు బిల్లు రూ. 2వేలు, వాతావరణం వేడిగా ఉండడం కోసం ఓ యంత్రం, ఆక్సిజన్ మిషన్‌కు నెలకు రూ. 6 వేలు, ఇతర ఖర్చులు మరో రెండు వేలు వెచ్చించాల్సి వస్తోందని తల్లిదండ్రులు తెలిపారు. ఐశ స్వతహాగా ఏ పని చేసుకోలేదని, భోజనం కూడా తినిపించాలి ఉంటుందని, ద్రవ పదార్థాలే ఎక్కువ ఇస్తున్నట్లు తెలిపారు. కదలలేని స్థితిలో ఉన్న కూతుర్ని కంటికి రెప్పలా కాపాడుకోవాలని, ఎవరో ఒకరు పక్కనే ఉండి చూసుకోవాలని తల్లి తెలిపింది. ఆక్సిజన్ మిషన్ పెట్టడం వల్ల కరెంటు పోకుండా చూసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇటీవల మూడు గంటల పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఐశను సబ్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అక్కడే పడుకోవాల్సి వచ్చిందని బోరున విలపించారు. ప్రస్తుతం వికలాంగ పింఛను రూ.3,016 వస్తోందని చెప్పారు. కొంత కాలం పాటు మందులు వాడితే బాలిక ఆరోగ్యం కుదటపడే అవకాశం ఉందని వైద్యులు చెప్పినట్లు బాలిక తల్లిదండ్రులు అబ్దుల్ ఉస్మాన్, నస్రీన్ తెలిపారు. దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని వారు వేడుకుంటున్నారు. బాలిక తండ్రి ఫోన్ నంబర్ 7036042976.


ఆక్సిజన్‌తో కాలం నెట్టుకొస్తున్న ఐశ

'కోట్‌పల్లి'ని సందర్శించిన ఐజీ

ప్రాజెక్టు వివరాలు, నీటి నిల్వపై ఆరా


కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు వద్ద నీటి ఉధృతిని పరిశీలిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

ధారూరు: మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టును గురువారం హైదరాబాద్ మల్టీజోన్ -2 ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఐజీ) షహనావాజ్ ఖాసీం పరిశీలించారు. ఎస్పీ కోటిరెడ్డి, డీఎస్పీ నర్సింహులు, సీఐ రామకృష్ణ, ఎస్ఐ సంతోష్ కుమార్, జిల్లా ఇరిగేషన్ ఇన్‌చార్జ్ ఎస్ఈ సుందర్, డీఈలు భాస్కర్, రవికుమార్, జేఈలు కనకలక్ష్మి, మాధురితో కలసి ప్రాజెక్టును సందర్శించారు. ఎగువ నుంచి వస్తున్న వరద, అలుగు ఉధృతిపై ఆరా తీశారు. ఇరిగేషన్ ఇన్‌చార్జ్ ఎస్ఈ సుందర్ ప్రాజెక్టు, సాగు వివరాలు, వరద నీరు గురించి వివరించారు. అనంతరం రుద్రారం - నాగసమందర్ గ్రామాల మధ్యన తాత్కాలిక వంతెనపై నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. జిల్లాలోని ధారూరు నుంచి పెద్దేముల్, కోట్‌పల్లి, బంటారం, మర్పల్లి మండలాలతో పాటు కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలకు ఈ మార్గం నుంచి ప్రయాణం చేయవచ్చని, వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిపివేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి ఐజీకి వివరించారు.

మహిళ మృతదేహం లభ్యం

షాద్‌నగర్ రూరల్: వాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన మహిళ మృతదేహం గురువారం లభ్యమైంది. ఎస్ఐ దేవకి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. కొందుర్గు మండలం ఆగిర్యాలకు చెందిన గుమ్మడి నిర్మలమ్మ(36) ఈ నెల 25న ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అయ్యవారిపల్లి వాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. భారీ వర్షాల నేపథ్యంలో మూడు రోజులుగా గల్లంతైన మహిళ మృతదేహం దొరకలేదు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు చేపట్టిన గాలింపు చర్యలేవీ ఫలితమివ్వలేదు. గురువారం ఉదయం నిర్మలమ్మ మృతదేహం చెట్ల పొదల మధ్య నీటిపై తేలి కనిపించింది. ఈ విషయమై సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు మృతదేహాన్ని వెలికి తీసి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిర్మలమ్మ తల్లి సుగుణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు కొనసాగుతుందని ఎస్ఐ దేవకి తెలిపారు.


దిర్సంపల్లి సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

జీవాలను కాపాడేందుకు వెళ్లి..

- విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి
- ఐనాపూర్‌లో ఘటన
- విద్యుత్ శాఖ అధికారుల తీరుకు నిరసనగా ధర్నా
- ఏఈ కిషోర్ హామీతో ఆందోళన విరమణ


బాల్‌రాజ్ మృతదేహం

దోమ: తెగిపడిన విద్యుత్ తీగల కారణంగా జీవాలు మృత్యువాత పడతాయని భావించిన రైతు వాటిని తొలగించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ ఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఐనాపూర్‌కు చెందిన బాల్‌రాజ్(45) ఇంటి ఆవరణలో బందర్ కేబుల్‌తో ఉన్న విద్యుత్ తీగలు ఉన్నాయి. వర్షాలకు ఇంటి ఆవరణలోని చెట్టు కూలీ విద్యుత్ తీగలపై పడింది. దీంతో తీగలు కిందకు వేలాడుతూ కనిపించాయి. వాటి కారణంగా మేకలు మృత్యువాత పడతాయని భావించిన రైతు తొలగించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మృతుడికి భార్య సువర్ణ, పిల్లలు వనజ, భాగ్యలక్ష్మి, రాజు ఉన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే బాల్‌రాజ్ మృతి చెందాడని కుటుంబీకులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ తీగల వద్ద ఉన్న చెట్లను తొలగించాలని పలు మార్లు వేడుకున్నా పట్టించుకోలేదని తెలిపారు. అధికారుల తీరుకు నిరసనగా గ్రామంలోని ప్రధాన రహదారిపై మృతదేహంతో బైఠాయించి ధర్నా నిర్వహించారు. అధికారులు రాకపోవడంతో దిర్సంపల్లి సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రవిగౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మృతుడి కుటుంబానికి రూ. 30లక్షల పరిహారం ఇవ్వాలని కుటుంబీకులు డిమాండ్ చేశారు. ఘటన స్థలానికి వచ్చిన విద్యుత్ శాఖ ఏఈ కిషోర్ గ్రామస్తులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. బాల్‌రాజ్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అంత్యక్రియలకు రూ. 20 వేలు, రూ. 5లక్షల పరిహారం అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

తాండూరు అభివృద్ధికి నిరంతర కృషి

జీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్

తాండూరు: ఎవరు ఎన్ని కుట్రలు చేసినా తాండూరు ప్రజల సేవకే నా జీవితం అంకితమని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ అన్నారు. గురువారం శుభప్రద్ పటేల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని భావిగి భద్రేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. రాబోయే రోజుల్లో సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు శుభప్రద్‌పటేల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్కులను పంపిణీ చేశారు.

సబ్సిడీ సరుకులకు మంగళం

- రేషన్ దుకాణాల్లో బియ్యం మాత్రమే పంపిణీ
- గతంలో 9 రకాల సరుకులు..
- ఆగిపోవడంతో పేదలపై భారం
- మళ్లీ పంపిణీ చేయాలంటున్న కార్డు దారులు

దౌల్తాబాద్: రోజురోజుకు నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పేదలు సరుకులు కొనాలంటేనే హడలిపోతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అమ్మ హస్తం పేరిట రేషన్ దుకాణాల్లో 9 రకాల సరుకులు పంపిణీ చేసే వారు. ప్రస్తుతం బియ్యం ఒక్కటే ఇస్తున్నారు. గతంలో బియ్యం, గోధుమలు, కిరోసిన్, నూనె, చింత పండు, పప్పులు, గోధుమ పిండి, పంచదార, ఉప్పు, పసుపు, కారంపొడి పంపిణీ చేసే వారు. వీటిని కొనుగోలు చేసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపేవారు. ప్రస్తుతం బియ్యాన్ని మాత్రమే సరఫరా చేస్తుండడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 36 రేషన్ దుకాణాలు ఉండగా 13వేల కార్డులు ఉన్నాయి. గతంలో కార్డులోని ప్రతి ఒక్కరికీ నాలుగు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. ఆహార భద్రత అమల్లోకి వచ్చినప్పటి నుంచి నాలుగు కిలోలను 6కు పెంచారు. బియ్యం కోటా పెంచడంతో సామాన్యులకు కొంత ఆర్థిక భారం తగ్గింది. కానీ సబ్సిడీపై సరుకులు సరఫరా చేయకపోవడంతో కార్డుదారులు ఒకింత నిరసన తెలుపుతున్నారు.


రేషన్‌దుకాణంలో బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

అన్ని సరుకులు ఇవ్వాలి



రేషన్ దుకాణాల్లో బియ్యం ఒక్కటి మాత్రమే ఇస్తున్నారు. మిగిలిన సరుకులు ఇవ్వకపోవడంతో పేదల ఇబ్బందులు పడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. సబ్సిడీపై సరుకులు ఇస్తే పేదలకు మేలు చేకూరుతుంది.

– నర్సప్ప, దౌల్తాబాద్

'అమ్మ హస్తం' కొనసాగించాలి



ఉమ్మడి రాష్ట్రంలో రేషన్ దుకాణాల్లో అమ్మ హస్తం పథకం కింద తొమ్మిది రకాల సరుకులు పంపిణీ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆ పథకాన్ని నిర్వీర్యం చేసింది. దీంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అమ్మహస్తం పథకాన్ని పునరుద్ధరించాలి.

– నర్సింలు, తిమ్మారెడ్డిపల్లి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆమనగల్లు: గుర్తుతెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణ పరిధిలోని హైదరాబాద్ – శ్రీశైలం జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. మున్సిపల్ పరిధిలోని చంద్రాయణపల్లి తండాకు చెందిన జటావత్ బద్య(39) ఆమనగల్లులోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఉదయం విధులు ముగించుకుని కాలినడకన తండాకు బయలుదేరాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన బద్యను అదే వాహనంలో చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మేడిగడ్డ తండా వద్ద మృతిచెందాడు. దీంతో మృతదేహాన్ని అక్కడి కల్వర్టు వద్ద పడేసి వెళ్లిపోయినట్లు తెలిసింది. మృతుడి భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాల్‌రాం తెలిపారు.

గుడులే టార్గెట్

- 19 ఆలయాలను దోచిన ఘరానా దంపతులు
- చోరీ సొత్తును ఇంట్లోనే దాచిన వైనం
- బంగారు, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ


నిందితుల నుంచి రికవరీ చేసిన నగదు, వెండి, బంగారు ఆభరణాలు

పరిగి: ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు భార్యాభర్తలు చోరీల బాట పట్టారు. ఇందుకోసం ఆలయాలను టార్గెట్‌గా చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను గురువారం పరిగి సీఐ కార్యాలయంలో డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి వెల్లడించారు. దోమ మండల పరిధిలోని బడెంపల్లికి చెందిన దుద్యాల వెంకటయ్య మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మొదటి భార్యతో గొడవలు కాగా ఆమె దూరమైంది. అనంతరం అరుణను రెండో పెళ్లి చేసుకున్నాడు. వెంకటయ్య ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతుండగా కరోనా లాక్‌డౌన్‌తో పరిస్థితి మరింత దిగజారింది. ఈ సమయంలో బషీరాబాద్ మండలం మంతన్‌గౌడ్‌లోని హనుమాన్ దేవాలయంలో సేదతీరిన దంపతులు.. ఎవరూ లేకపోవడంతో గుడికే కన్నం వేశారు. ఇదేదో బాగుందిలే అనుకుని.. గుడులనే టార్గెట్‌గా చేసుకుని కారు, బైక్‌పై వెళ్తూ చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఈనెల 25న వనపర్తి జిల్లా ఎక్లాస్‌పూర్‌లోని బాలాజీ టెంపుల్‌లో చోరీకి పాల్పడ్డారు. గుడిలో దొంగతనం కాగా పోలీసులు కేసు నమోదు చేసి కారు నంబర్ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. సీసీ కెమెరాలో కారు నంబర్ క్లియర్‌గా కనిపించకపోవడంతో టోల్‌గేట్ పక్క సీసీ కెమెరాల నుంచి కారు నంబర్ సేకరించారు.

సొత్తు రికవరీ..

నిందితులు మొత్తం 19 ఆలయాల్లో చోరీకి పాల్పడ్డారు. ఇందులో వికారాబాద్ జిల్లాలో 16, నారాయణపేటలో 2, వనపర్తిలోని మరో ఆలయంలో దొంగతనం చేసినట్లు ఒప్పుకొన్నారు. ఎత్తుకెళ్లిన బంగారు, వెండి ఆభరణాలను స్థానికంగా విక్రయిస్తే గుర్తుపడుతారని భావించారు. సమయం దొరికినప్పుడు ఇతర రాష్ట్రాలకు వెళ్లి అమ్ముకోవాలనే ఆలోచనతో ఇంట్లోనే దాచిపెట్టారు. నిందితుల నుంచి ఒక స్విఫ్ట్ కారు, బైక్, సెల్ ఫోన్, 3.3 తులాల బంగారం, 2.56 కేజీల వెండి ఆభరణాలు, రూ.1,78,300 నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ వెంకటరామయ్య, ఎస్ శేఖర్‌గౌడ్, సీసీఎస్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ఆ ఊరికి వాగులే అడ్డంకి

- వర్షాలు పడిన ప్రతి సారీ రాకపోకలు బంద్
- విద్యార్థులు, ప్రజలకు తప్పని పాటు
- అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి వాగు దాటుతున్న జనం
- బ్రిడ్జిలు నిర్మించాలని తండావాసుల విన్నపం


అన్నారం వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఊరు దాటలేక ఒడ్డున నిల్చున్న తండా వాసులు

యాలాల: అదో తండా.. 12 ఇళ్లు.. వంద మంది జనాభా.. 45 మంది ఓటర్లు 23మంది విద్యార్థులు.. వీరికి ఏ చిన్న అవసరం వచ్చినా పొరుగు గ్రామానికి వెళ్లాల్సిందే.. చుట్టూ అటవీ ప్రాంతం, కంకర తేలిన కాలిబాట.. వీటికి తోడు రాకపోకలకు అడ్డుగా జుంటుపల్లి, అన్నారం వాగులు.. వర్షాలు పడితే ఈ వాగులు ఉధృతంగా ప్రవహిస్తాయి. దీంతో తండాకు రాకపోకలు నిలిచిపోతాయి. ఇదీ యాలాల మండలం రేళ్లగడ్డ తండా పంచాయతీ అనుబంధ గ్రామం పటేల్‌చింత తండా దుస్థితి.. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు అన్నారం వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు తండా దాటి ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఒక వేళ అన్నారం వాగు దాటి ముందుకు వచ్చినా జుంటుపల్లి ప్రాజెక్టు అలుగు వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వాగుల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో దాటేందుకు ఎవరూ సాహసించరు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు మాత్రమే భయంభయంగా వాగు దాటుతున్నారు. పటేల్‌చింత తండా నుంచి పక్క గ్రామానికి వెళ్లే మార్గంలో అన్నారం వాగుపై లో లెవెల్ కాజ్‌వే నిర్మిస్తే సమస్య కొంత మేర తగ్గుతుందని తండా వాసులు అంటున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ తదితరులు దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

రోజూ ఇబ్బందులే



వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తండాకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసరం అయితే ప్రాణాలకు తెగించి రెండు వాగులు దాటాల్సి వస్తోంది. అన్నారం వాగుపై బ్రిడ్జి నిర్మించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులను కోరినా ఎవరూ పట్టించుకోవడం లేదు. వర్షం పడిన ప్రతి సారీ అవస్థలు పడుతున్నాం. తండా అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉండడంతో విష కీటకాల సంచారం ఎక్కువగా ఉంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక ఆందోళన చెందుతున్నాం. జుంటుపల్లి అలుగు, అన్నారం వాగుల వద్ద బ్రిడ్జిలు నిర్మించి సమస్యను పరిష్కరించాలి. – భీం, పటేల్ చింత తండా

ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి


మాట్లాడుతున్న రాజ్‌కుమార్ నాయకులు

తాండూరు: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలన్నీ బీసీలకు 60 శాతం అవకాశాలు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం తాండూరు పట్టణంలో బీసీ సంఘం నాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీల నేతలు సామాజిక న్యాయం పాటించడం లేదన్నారు. బీసీ ఓట్లతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం సైతం బీసీలను మోసం చేస్తోందని మండిపడ్డారు. 60 శాతం జనాభా ఉన్న బీసీలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించకుండా 5 శాతం ఉన్న అగ్ర వర్ణాలకు పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు మంగళారం మధులత, బీసీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సయ్యద్ షుకూర్, బీసీ నాయకులు శ్రీనివాస్, లక్ష్మణ్‌చారి, పరమేష్, లింగదళ్లి రవికుమార్ ఉన్నారు.